
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 348 | శనివారం 8 నవంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-




భక్త కనకదాస జయంతి సభలో మంత్రి నారా లోకేష్

# కురుబలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం







- గుడికట్ల పూజారులకు గౌరవవేతనం అందిస్తాం
- బైరవానితిప్ప ప్రాజెక్టును మేమే పూర్తిచేస్తాం
- కేంద్రంతో మాట్లాడి ఆర్డీటీ లైసెన్సు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నాం..

అంకుశం ప్రత్యేక ప్రతినిధి అనంతపురం

తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన కురుబ సోదరులను మరువం, గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శనివారం కళ్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి భక్త కనకదాస 538వ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్త -

మిగతా3లో

# నలుగురు కింగ్‌పిన్స్‌ను గుర్తించాం




- ఎర్రచందనం స్మగ్లర్లకు డిప్యూటీ సీఎం పవన్ హెచ్చరిక
- "ఎర్రచందనం చెట్టు వెనుక ఆధ్యాత్మిక చరిత్ర ఉంది
- వేంకటేశ్వరస్వామి గాయం నుంచి పుట్టిందని పురాణాల ద్వారా తెలుస్తోంది
- ఎర్రచందనం అక్రమ రవాణాపై జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించాం
- శేషాచలం అడవుల్లో స్మగ్లర్లు దాదాపు 2లక్షల ఎర్రచందనం చెట్లు కొట్టేసి ఉంటారని అధికారుల అంచనా

అంకుశం ప్రత్యేక ప్రతినిధి తిరుపతి

ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. తిరుపతి జిల్లాలోని మామం డూరు అటవీ ప్రాంతాన్ని, మంగళంలోని ఎర్రచందనం గోదాముని పరిశీలించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో అటవీ అధికారులతో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఎర్రచందనం చెట్టు వెనుక ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. వేంకటేశ్వరస్వామి గాయం నుంచి పుట్టిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణాపై జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించాం. శేషాచలం అడవుల్లో స్మగ్లర్లు దాదాపు 2లక్షల ఎర్రచందనం చెట్లు కొట్టేసి ఉంటారని అధికారుల అంచనా. అక్రమ రవాణాను అడ్డుకు నేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఏపీ, కర్ణాటక మధ్య ఒప్పందం చేసుకుందామని కర్ణాటక సీఎం సిద్దరామ య్యను కోరాం. ఎర్రచందనం స్మగ్లింగ్స్ - మిగతా3లో

# కిషన్ రెడ్డిది, రేవంత్ రెడ్డిది ఫెవికాల్ బంధం



- ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉంటే ఎందుకు విచారణ జరగడం లేదు
- బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారని ఢిల్లీలో భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ రైడ్లు జరిగాయి
- పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్స్ ఐతే ఎందుకు చెప్పలేదు
- ఈడీ ఎందుకు పొంగులేటిపై ప్రెస్ స్టేట్‌మెంట్ ఇవ్వలేదు
- మందిని తొక్కడం.. మాట తప్పడం రేవంత్ రెడ్డి నైజం : హరీశ్‌రావు
- రేవంత్ రెడ్డి తన అసమర్థతను చెప్పకనే చెప్పుకున్నాడు
- రెండు సంవత్సరాల రేవంత్ రెడ్డి పాలనలో చేసిందేమీ లేక గత కాంగ్రెస్ పాలనలో చేసింది చూసి ఓటు వేయాలని అడిగాడు

అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్

దొంగే దొంగ అన్నట్టుంది రేవంత్ రెడ్డి తీరు.. కిషన్ రెడ్డిది, రేవంత్ రెడ్డిది ఫెవికాల్ బంధం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉంటే ఎందుకు విచారణ జరగడం లేదు. బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారని ఢిల్లీలో భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ రైడ్లు జరిగాయి. గుర్గావ్‌లో భట్టి విక్రమార్క ఇల్లు, ఆయన అత్తగారిల్లు ఉంది. ఈ విషయం ఎందుకు బయటకు రాలేదు. బీజేపీకి కాంగ్రెస్ పార్టీకి మధ్యలో ఉన్న ఒప్పందం ఏమిటి? పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్స్ ఐతే ఎందుకు చెప్పలేదు. ఈడీ ఎందుకు పొంగులేటిపై ప్రెస్ స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. బీజేపీతో అంటకాగింది -

మిగతా3లో

# కుప్పం దశ మార్చే ప్రాజెక్టులు



- ఒకేరోజు 7 పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు
- హిందాల్కో, మదర్ డైరీ సహా పలు దిగ్గజ సంస్థల రాక
- ఈ పరిశ్రమలతో 22,330 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- త్వరలో మరో 8 కంపెనీలు, రూ.6,339 కోట్ల పెట్టుబడులు
- కుప్పాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న చంద్రబాబు
- హంద్రీ-నీవా నీటితో పారిశ్రామిక అవసరాలు తీరుస్తామని హామీ

అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, ఒకే రోజు ఏకంగా ఏడు భారీ పరిశ్రమలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రూ.2,203 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న ఈ ఏడు సంస్థల్లో దేశంలోని దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన హిందాల్కో సంస్థ రూ.586 కోట్లతో మొబైల్, ల్యాప్‌టాప్ వంటి టెక్ పరికరాల విడిభాగాల తయారీ - మిగతా3లో

# కురుబలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

కనకదాస విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ వారి మాటల్లోనే... తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు అన్ని విధాలుగా టీడీపీకి అండగా నిలిచారు. ఇప్పుడు మేము బీసీలను బలోపేతం చేయడానికి అన్నివిధాలుగా కృషిచేస్తున్నాం. ఈ రోజు చాలా మంచి రోజు. మహా భక్తుడు కనకదాస గారి జయంతి. ఈ సందర్భంగా భక్త కనకదాస విగ్రహావిష్కరణ చేయడం, కనకదాస గారి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం నా జీవితంలో మార్చిపోలేని రోజు. ఒకే రోజు మూడు పండుగలను కురుబ సోదరులతో కలిసి జరుపుకోవడం నా అదృష్టం. కనకదాస గారు గొప్ప పాటలతో శ్రీకృష్ణుడుని తన వైపు తిప్పుకున్నారు. ప్రజల్లో దైవ భక్తిని పెంచారు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఆయన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారు. చిన్నతనంలో బాగా చదువుకున్నారు. సైన్యంలో చేరి యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆయన జీవితాన్ని భక్తికి, ప్రజలకు అంకితం చేశారు. ఒక రోజు కనకదాస గారిని ఆయన గురువు నీకు మోక్షం పొందాలని లేదా అని అడిగారు. అప్పుడు కనకదాసు గారు అహంకారం అనేది పోతే మోక్షం వస్తుంది అని చెప్పిన గొప్పవ్యక్తి ఆయన. కనకదాసు గారి జీవితం మనకు స్పూర్తి. ఆయన చూపిన మార్గంలో సమాజం నడవాలి.

### భైరవానితిప్ప ప్రాజెక్టును పూర్తిచేస్తాం

భైరవతిప్ప ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది టీడీపీ, పూర్తిచేసేది కూడా టీడీపీనే. జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. కరువుసీమలో కార్ల పంట పండించిన చరిత్ర టీడీపీది. నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు ఇప్పుడు పరిశ్రమలు తెస్తున్నాం. జిల్లాలో హార్టికల్చర్ కు సాయం అందిస్తాం. తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉన్న జిల్లాను 3వ స్థానంలోకి తీసుకొస్తాం. దశాబ్దాలుగా మన జిల్లాలో ఆర్ డీటీ సంస్థ అనేక సేవలు అందిస్తోంది. హాస్పటల్స్, పాఠశాలలు, స్వయం ఉపాధి పరంగా సేవలు చేస్తున్నారు. వారి లైసెన్సు పునరద్ధరణ ఆలస్యమైంది. నేను బాధ్యతగా తీసుకుని కేంద్రంతో మాట్లాడి లైసెన్సును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నాం.. ఇకపై వారి కార్యక్రమాలను ముందుకు తీసుకెళతాం. బీసీ సోదరులు ఒక విషయాన్ని ఆలోచించాలి. టీడీపీ వల్లే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది. 3,132 కి.మీ.లు పాదయాత్ర చేసినప్పుడు ఉపకులాలను కలిశా. మీ సమస్యలను నేరుగా తెలుసుకున్నా, ఆ సమస్యలను పరిష్కరించే వరకు నిద్రపోను. ఫైర్ బ్రాండ్ మంత్రి సవితమ్మ మీకు ఉన్నారు. చెప్పిన పని అయ్యేవరకు ఆమె వదిలిపెట్టరు. బీసీ సంక్షేమ మంత్రిగా ఆమెకు కూడా బాధ్యత ఉంది. ఇచ్చిన



హామీలను మనం నిలబెట్టుకోవాలి. ఎంపీ పార్థసారధి కేంద్రంతో పోరాడుతున్నారు, నిధులు తెచ్చేందుకు కష్టపడుతున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలతో కురుబలకు అనుసంధానం చేసి ముందుకు తీసుకెళ్లండి.

### అనంతపురం జిల్లాకు రుణపడి ఉంటాం

ఉమ్మడి అనంతపురం జిల్లాకు మా కుటుంబం రుణపడి ఉంటుంది. ఎన్టీఆర్ ను 3సార్లు శాసనసభకు పంపించింది. నా మామ నందమూరి హరికృష్ణ గారిని ఒకసారి గెలిపించారు, మరొక మామ బాలకృష్ణను మూడుసార్లు గెలిపించి శాసనసభకు పంపిన గొప్పనేల అనంతపురం. ఈ నేలకు మేము ఎంతచేసినా తక్కువే. మా జీవితాంతం మీకు రుణపడి ఉంటాం. అనంతపురం అంటే టీడీపీ, టీడీపీ అంటేనే అనంతపురం. టీడీపీని కురుబలు గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటూ వస్తున్నారు. కురుబలకు రాజకీయంగా, ఆర్థికంగా స్వాతంత్యం వచ్చింది టీడీపీతోనే. కురుబ సోదరులు మొదటి నుండి తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు. ఎన్టీఆర్ గారి దగ్గర నుంచి చంద్రబాబు గారి వరకు కురుబలు అంటే ప్రత్యేక ప్రేమ. కురుబలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసింది టీడీపీ. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం కురుబ సామాజికవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. కురుబ కార్పొరేషన్ ను టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కురుబ కమ్యూనిటీకి వివిధ సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేసింది. గొర్రెల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు, బీమా కూడా ఇచ్చాం. 50% సబ్సిడీతో 4 లక్షల వరకు రుణసౌకర్యం కల్పించాం. కురుబ కమ్యూనిటీ భవనాలు నిర్మించాం. కురుబ సామాజిక వర్గాన్ని రాజకీయంగా టీడీపీ ప్రోత్సహించింది. ఎస్.రామచంద్ర రెడ్డి గారు 14 శాఖలతో మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. బీకే పార్థసారధి ఎంపీగా, ఎమ్మెల్యేగా, జడ్పి ఛైర్మన్ గా పనిచేశారు. సవిత గారు గతంలో కురుబ కార్పోరేషన్ ఛైర్మన్ గా పనిచేసి, నేడు మంత్రిగా పనిచేస్తున్నారు. కురుబ సాధికార రాష్ట్ర సభ్యుడు బస్తిపాటి నాగరాజు గారు ఇప్పుడు కర్నూలు ఎంపీ. అనంతపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, కర్నూలు జడ్పి ఛైర్మన్ బత్తిన వెంకట రాముడు కురుబ సామాజికవర్గానికి చెందిన వారు. చాలా మందికి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవులు కూడా లభించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి కురుబ సవిత, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ పార్థసారధి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, కురుబ కార్పోరేషన్ ఛైర్మన్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల వ్యవహారశైలిపై అసంతృప్తి

**గుంటూరు :** ఏపీ క్యాబినెట్ మీటింగ్ జరిగే సమయాల్లో మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వారి శాఖపై ఏమాత్రం పట్టు సాధించలేని పరిస్థితి నెలకొందని.. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోను ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను గట్టిగా తిప్పికొట్టడంలోను మంత్రుల ఇవ్వాల్‌మెంట్ సరిగా ఉండడంలేదనే భావనలో సీఎం ఉన్నారనే గుసగసలు వినిపిస్తున్నాయి. అటు పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా మంత్రులు పాల్గొనలేకపోతున్నారనే చర్చ పార్టీ నేతల్లో ఉందట. సగం మంది మంత్రులు హైదరాబాద్, వైజాగ్, బెంగళూరులకు షటిల్ సర్వీస్ చేస్తున్నారనే విమర్శలున్నాయట. క్యాబినెట్ భేటీలో మంత్రుల తీరుపై చర్చ:. గత ఆరు నెలల కాలంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్రంలో అక్కడక్కడా పర్యటనలు చేస్తూ.. ప్రభుత్వం పై సంబంధింత శాఖల మంత్రుల పై ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ శాఖలకు సంబంధించిన మంత్రులు గాని.. మిగిలిన వారు కానీ వైసీపీ నేతల నుంచి, జగన్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వడంలో విఫమలవుతున్నారనే చర్చ టీడీపీలో నడుస్తోందట. ఈ విషయమై ప్రతి క్యాబినెట్ భేటీలోను మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.. ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు:. వైసీపీ అధ్యక్షుడు జగన్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని, వాస్తవాలు ప్రజలకు చెప్పటంలో మంత్రులు వైఫల్యం చెందుతున్నారని చంద్రబాబు అసంతృ వ్యక్తం చేస్తూనే ఉన్నారట. చంద్రబాబు ఎన్నిసార్లు అసంతృప్తి వ్యక్తం చేసినా నేతల తీరులో మాత్రం మార్పు రావడం లేదట. తాజాగా మంత్రుల పై లోకేష్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం పార్టీ నుంచి కానీ, మంత్రుల నుంచి కానీ గట్టి కౌంటర్ ఎందుకు ఇవ్వలేకపోయారని అడిగినట్లు టాక్ వినిపిస్తోంది. గ్రీవెన్స్‌సెల్‌ను పట్టించుకోవడం లేదని లోకేష్ ఆగ్రహం:. ప్రతిపక్షంగా వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రులు లైట్ తీసుకుంటున్నారనే ఫీలింగ్‌లో ఉన్న నాయకత్వానికి.. టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రీవెన్స్ సెల్‌ను కూడా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదనే చర్చ నడుస్తోందట. ప్రజాదర్బార్ విషయంలో నారా లోకేష్ కూడా సీరియస్ అయినట్లు చెప్తున్నారు. ప్రజా దర్బార్‌ను గాలికి



వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన యువనేత, అసలు చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం లేదని మండిపడ్డారట. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన లోకేష్, ఆ ప్రజా దర్బార్ కు వేల సంఖ్యలో ప్రజలు రావడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారట సుమారు ఐదు గంటల పాటు సమస్యలు విని అసలు ఎందుకు ఈ ఇంతమంది సమస్యలతో పార్టీ కార్యాలయానికి వచ్చారంటే నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారట. ఇకపై నియోజకవర్గాల్లో, మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించాల్సిందనేని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌కు మంత్రులు తప్పకుండా హాజరు కావాలిని ఆదేశాలు జారీ చేశారట. ఆ క్రమంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయిలో మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోడంలేదా అనే చర్చ మొదలైందట. మరోవైపు వైసీపీ చేస్తున్న విమర్శల్ని దీటుగా ఎదుర్కొనలేకపోవడం మంత్రుల వైఫల్యంగా మారిందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. 2014 -19 మధ్య కూడా వైసిపి చేసిన ప్రచారాన్ని ధీటుగా సమాధానం చేప్పకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో ఓటమి కారణంగా పార్టీ అధిష్టానం భావిస్తుందనే చర్చ కూడా పార్టీ నేతల్లో ఉందట:. గతంలో జరిగిన తప్పిదాన్ని మరోసారి జరక్కుండా చూసుకోవాలని అధిష్టానం భావిస్తుందట. విశాఖపట్నం సమ్మిట్ అయిపోయిన తర్వాత జిల్లాల వారీగా మంత్రులు ఎమ్మెల్యేలతో లోకేష్ సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారట. ప్రతిపక్ష పార్టీ చేసే ప్రతి విమర్శకి సంబంధిత జిల్లా నుంచి అయితే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు.. రాష్ట్రస్థాయిలో అయితే ఆ శాఖ మంత్రి, ప్రభుత్వ అధికారులతో వెంటనే రిప్లై ఇప్పించాలని యోచిస్తున్నారట. పార్టీ, ప్రభుత్వం రెండు కలిసి పనిచేసే విధంగా అధిష్టానం కసరత్తు చేస్తుందట. త్వరలోనే ఫాక్ట్ చెక్ పేరుతో టీడీపీ కమిటీ వేయాలని చెప్పి నిర్ణయం తీసుకున్నట్లు నేతలు చెబుతున్నారట. ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు.. దానికి కౌంటర్ గా ఏ రకంగా ముందుకు వెళ్లాలి అనేదానిపై కమిటీ వేసే ఆలోచనలో టీడీపీ ఉందట. టీడీపీ అధిష్టానం కార్యచరణ ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి

# అభివృద్ధిపైనే ఆశలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపైనే ఫోకస్ పెట్టారు. విడిపోయి నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ఏడు పదులు దాటిన వయసులోనూ చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను ఎవరూ కాదనలేరు. పెట్టుబడుల కోసం ఒక ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకుని విదేశాల చుట్టూ తిరగడం ఒక్క చంద్రబాబు విషయంలోనే చూస్తున్నాం. ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తనకంటూ రాజకీయాల్లో ఒక మార్క్ ను క్రియేట్ చేసుకోవాలని పడుతున్న తపన స్పష్టంగా కనపడుతుంది. అందుకే వయసును, అలసటను లెక్క చేయకుండా ఆయన పనిచేస్తున్నారు. అయితే కార్యకర్తలు మాత్రం చంద్రబాబు పనితీరుపై కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో జరిగిన పొరపాట్లను కూడా గుర్తించడం లేదని కార్యకర్తలే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కేవలం అభివృద్ధి సంక్షేమం తమను మరొకసారి అధికారంలోకి తెస్తుందన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. కానీ టీడీపీ కార్యకర్తలు మాత్రం అందుకు విరుద్ధంగా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పోస్టు చేస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. 1999లో రెండోసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సైబరాబాద్ ను అభివృద్ధిని చేసినప్పటికీ 2004 ఎన్నికల్లో దాని చుట్టు పక్కల పరిధిలో ఉన్న యాభై శాసనసభ నియోజకవర్గాల్లో రాజేంద్ర నగర్ నియోజకవర్గం మినహా మరే చోట టీడీపీ గెలవలేకపోవడాన్ని ఈ సందర్భంగా కార్యకర్తలు గుర్తు చేస్తున్నా 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి అమరావతితో పాటు అనంతపురంలో కియా పరిశ్రమను తెచ్చారని, కానీ అమరావతి చుట్టు పక్కలతో పాటు, అనంతపురంలో కియా పరిశ్రమను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ పార్టీ పూర్తిగా 2019 ఎన్నికల్లో చతికలపడటానానికి గల కారణాలను కూడా గుర్తుంచుకోవాలని మరికొందరు కోరుతున్నారు. గతంలో కంటే ఈసారి కాస్త భిన్నంగా చంద్రబాబు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా సమపాళ్లలో తీసుకెళుతున్నా వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు టీడీపీకి అనుకూలంగా ఉంటాయన్న గ్యారంటీ ఉందా? అని కొందరు నేరుగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చంద్రబాబు వాస్తవంలోకి వచ్చి కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాలని కోరుతున్నారు.

## నలుగురు కింగ్‌పిన్స్‌ను గుర్తించాం

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్న నలుగురు కింగ్ పిన్స్‌ను గుర్తించాం. వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టాం.శేషాచలం అడవుల్లో మాత్రమే ఉండే ఎర్రచందనం చెట్లు పర్యావరణాన్ని కాపాడుతాయి. ఈ చెట్ల నరికివేతలో స్థానికులు పాల్గొనవద్దు. ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తున్న ఈ దేశంలో.. ఎర్ర చందనం స్మగర్ల ఆట కట్టించడం పెద్ద లెక్క కాదు. స్మగ్లింగ్ స్వచ్ఛందంగా ఆపకపోతే.. ఎలాంటి చర్యలకైనా వెనుకాడం. అటవీ చట్టం ప్రకారం.. ఎర్రచందనం స్మగ్లర్ల ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఒక సారి ఆపరేషన్ మొదలు పెడితే .. వెనుదిరిగే ప్రసక్తే ఉండదు. పర్యావరణాన్ని విధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోం. ఎర్రచందనం నరికివేతలో పాల్గొనే తమిళనాడు కూలీలకు కూడా అవగాహన కల్పిస్తాం. వేంకటేశ్వరస్వామి భక్తులు కూడా ఎర్రచందనాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించాలి" అని పవన్ తెలిపారు.

## కుప్పం దశ మార్చే ప్రాజెక్టులు

-మొదటిపేజీ తరువాయి

యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. శ్రీజా డైరీ రూ.290 కోట్లతో సమీకృత డెయిరీ, పశువుల మేత ప్లాంటును, ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.525 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను, ఎస్వీఎఫ్ సోయా రూ.373 కోట్లతో వంట నూనెల తయారీ యూనిట్‌ను స్థాపించనున్నాయి. వీటితో పాటు మదర్ డైరీ రూ.260 కోట్లతో పండ్ల రసాల యూనిట్‌ను, ఇ-రాయిస్ ఈవీ రూ.200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని, అలీప్ సంస్థ రూ.27 కోట్లతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయనుంది.

### కుప్పం దశ మార్చే ప్రణాళిక

ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, భవిష్యత్తులో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం భౌగోళిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.

### రైతులకు, మహిళలకు పెద్దపీట

ఈ పరిశ్రమల రాకతో కేవలం యువతకు ఉద్యోగాలే కాకుండా, స్థానిక రైతులు, మహిళలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. శ్రీజా డెయిరీ రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలను, మదర్ డైరీ పండ్లను, ఎస్వీఎఫ్ సోయా స్థానిక పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయని, దీనివల్ల పాడి, వ్యవసాయ రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సీఎం తెలిపారు. ప్రత్యేకంగా మహిళల కోసం అలీప్ సంస్థ నిర్మిస్తున్న 'మహిళా శక్తి భవన్' ద్వారా 4,000 మందికి ఉపాధి, శిక్షణ లభిస్తాయని చెప్పారు. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామ్లీ-వన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలతో చరిత్రను తిరగరాస్తాం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### త్వరలో మరో 8 కంపెనీలు

ఈ ఏడు కంపెనీలే కాకుండా త్వరలోనే రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు కుప్పానికి రానున్నాయని, వాటి ద్వారా అదనంగా 43 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చంద్రబాబు శుభవార్త చెప్పారు. దీంతో బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, ఫుడ్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో కుప్పం కీలక కేంద్రంగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కరవును దూరం చేసేందుకు 700 కిలోమీటర్ల దూరం నుంచి హంద్రీ-నీవా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, దీంతో తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత ఉండదని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ, సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

## వైసీపీ గూటికే విజయిసాయి?

-మొదటిపేజీ తరువాయి

చేయడం మాత్రం సంచలనంగా మారింది. దీని వెనుక విజయసాయిరెడ్డి ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.కచ్చితంగా కేసులకు భయపడి విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారని సాక్షాత్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. వైసీపీ శ్రేణులు సైతం ఇదే విషయాన్ని చెప్పుకుంటూ వస్తున్నాయి. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి అసలు సూత్రధారుడు అన్న విజయసాయిరెడ్డి.. అవసరమైతే ప్రత్యేక దర్యాప్తు బృందానికి అన్ని వివరాలు సమర్పిస్తానని చెప్పుకొచ్చారు. మొత్తం విజయసాయిరెడ్డి ఇచ్చిన వివరాలతోనే ఇప్పటి వరకు అరెస్టులు జరుగుతున్నాయని అంతా భావించారు. అయితే ఇప్పుడు ఆయన అల్లుళ్లు ఇద్దరు పిటిషన్లు దాఖలు చేయడంతో.. విజయసాయిరెడ్డి అడ్డం తిరిగారు అన్న టాక్ వినిపిస్తోందివిజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరతారని ప్రచారం సాగింది. ఆయనకు ఇప్పుడు ఆప్షన్ లేదు. జగన్మోహన్ రెడ్డికి గత్యంతరం లేదు. జగన్ పక్కన విజయసాయిరెడ్డి ఉండడంతో చాలా రకాల పనులు ఇట్టే జరిగిపోయేవి. ఢిల్లీ స్థాయిలో చాలా పనులను చక్కదిద్దే వారు విజయసాయిరెడ్డి. కానీ జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పేరు మోసిన బిగ్ హాండ్స్ కలిసి రావడం లేదు. ఇటువంటి తరుణంలో విజయసాయిరెడ్డి తో రాజీ చేసుకుంటే మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏ కేసులకు భయపడి వైసీపీ నుంచి బయటకు వచ్చారో.. అది నెరవేరడం లేదు. అందుకే విజయసాయిరెడ్డి నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## నిమ్మకాయలకు మళ్లీ ఆశలు

**రాజమండ్రి :** టీడీపీలో సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తిరిగి యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తుంది. ఆయనకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం లభిస్తుందన్న అంచనాల్లో నిమ్మకాయల అనుచరులున్నారు. దశాబ్దకాలం నుంచి టీడీపీనే నమ్ముకుని ఉన్న నిమ్మకాయల చినరాజప్ప 2014 ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు మంత్రివర్గంలో చేరారు. అప్పట్లో హోంమంత్రి బాధ్యతను చేపట్టారు. అంతేకాదు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా లభించింది. చంద్రబాబుకు, లోకేశ్ కు



అత్యంత సన్నిహితుడైన, నమ్మకమైన నేతగా ఆయన పేరు తెచ్చుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనకు ఈసారి మంత్రిపదవి దక్కలేదు కేవలం సామాజిక వర్గాల సమతూకంలో భాగంగానే నిమ్మకాయల చినరాజప్పకు మంత్రిపదవి దక్కలేదు. అయితే వచ్చే ఏడాదిలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈసారి ఖచ్చితంగా నిమ్మకాయల చినరాజప్పకు మంత్రి పదవి దక్కుతుందన్న ఆశలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న కాపు సామాజికవర్గం మంత్రుల్లో నుంచి తప్పించిన వారి స్థానంలో రాజప్పకు అవకాశం దక్కుతుందని అంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా కావడం ఒకింత మంత్రిపదవికి ఇబ్బందికరంగా మారుతుందంటున్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. జనసేనకు చెందిన ఇద్దరు మంత్రులు ఉండటంతో మరో కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ఎలా అప్పగిస్తారన్న ప్రశ్న కూడా కలుగుతుంది. కానీ పెద్దాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నిమ్మకాయల చినరాజప్ప మాత్రం ఆశలు వదులుకోకుండా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తూర్పు గోదావరి జిల్లాలో తానే పార్టీలో సీనియర్ కావడంతో పాటు పార్టీని నమ్ముకుని ఉండటం కూడా తనకు కలసి వస్తుందని నమ్ముతున్నారు. కానీ సామాజికవర్గం కోణంలో చూస్తే మాత్రం కూటమి ప్రభుత్వంలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు చాలా తక్కువేనని అంటున్నారు. ఈ టర్మ్ లో మంత్రి పదవి రాకపోతే వచ్చే ఎన్నికలకు తాను శాసనసభకు పోటీ చేయకుండా పార్టీ నామినేటెడ్ పదవి అంటే రాజ్యసభకు వెళ్లాలన్న యోచనలో కూడానిమ్మకాయల చినరాజప్ప ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద ఒక ప్రయత్నం చేస్తే పోయేదేముంది అన్న రీతిలో ఆయన తన వంతుగా ప్రయత్నాలు చేస్తున్నారట.

# శ్రీ సత్య సాయి ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి

– భారత ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలి

– జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి నవంబరు 8:** భగవాన్ శ్రీ సత్య సాయిబాబా గారి శత జయంతి ఉత్సవాల కోసం పుట్టపర్తికి విచ్చేసే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు పర్యటనకు కట్టుదిట్టంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

శనివారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, శ్రీ సత్య సాయి ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ లు... జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ అంకిత సూరణ మహావీర్, వివిధ శాఖల అధికారులతో కలిసి పుట్టపర్తిలో ప్రధాన మంత్రి పర్యటించే ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సమీక్షించారు.ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు ఇతర ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో, శ్రీ సత్య సాయి విమానాశ్రయం, లాంజ్‌లు, హిల్ వ్యూ స్టేడియం, సాయి కుల్వంత్ హాలు మొదలైన ప్రదేశాల్లో చేయాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా ఎన్.టి. చౌదరి లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ స్థలం పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. విమానాశ్రయం నుంచి ఆశ్రమం వరకు ప్రధానమంత్రి పర్యటన మార్గం, భగవాన్ శ్రీ సత్య సాయి మహా సమాధి దర్శనం, స్టేడియంలో జరిగే కార్యక్రమాలు వంటి అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విఐపీలు, వాహనాల పార్కింగ్, ట్రస్ట్‌కు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు, ప్రజా నియంత్రణ తదితర అంశాలపై కూడా అధికారులతో సమన్వయంగా చర్చించారు. అన్ని శాఖలు సమష్టిగా సమన్వయంతో ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లను పూర్తి చేసి ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సూచించారు.

ఈ సమావేశంలో ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, ఆనందకుమార్, ఆర్టీవో కరుణసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పబ్లిక్ హెల్త్ డిఈ నరసింహ, తహసీల్దార్ కళ్యాణ్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో శ్రీ భక్త కనకదాస జయంతి రాష్ట్ర కార్యక్రమ ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేష్

– 9 అడుగుల శ్రీ భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరణ

– వేలాది మంది మహిళలు, స్థానిక ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లిన మంత్రి





**అంకుశం ప్రతినిధి కళ్యాణదుర్గం, నవంబర్08:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో సామాజిక తత్వవేత్త, స్వరకర్త, కురుబల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాస 538వ జయంతి రాష్ట్ర ఉత్సవాల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణ, హిందూపురం రోడ్డు, బైపాస్ సర్కిల్ లో స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటుచేసిన 9 అడుగుల కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బైపాస్ సర్కిల్ కు శ్రీ భక్త కనకదాస సర్కిల్ గా నామకరణం చేశారు. అంతకుముందు బైపాస్ సర్కిల్ కు వేలాది మంది మహిళలు, స్థానిక ప్రజలతో కలిసి మంత్రి నారా లోకేష్ ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్.సవిత, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట శివుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కందికుంట వెంకట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భక్త కనకదాస వేడుకల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మవరం లో వైభవంగా కనకదాసు జయంతి వేడుకలు.



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 8:** పట్టణములో కనకదాసు జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు మాజీమంత్రి మాలగుండ్ల శంకర నారాయణ ,ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య పాల్గొన్నారు. పట్టణములోని ఎల్సికేపురంలో గల యశోదమ్మ వకీలు పెద్దయ్య కురుబ కళ్యాణ మండపము నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తూ, సాయిబాబా గుడి మీదుగా కళాజ్యోతి సర్కిల్ కి చేరుకున్నారు. అక్కడ ఉన్నటువంటి కనకదాసు విగ్రహాన్ని వివిధ పూలమాలలతో అలంకరించిన వైనం అందరిని ఆకట్టుకుంది. అనంతరం బాణసంచాలతో కాల్చి సంబరాలను జరుపుకున్నారు. తదుపరి కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ జయంతి వేడుకల్లో గురవయ్యలు కోలాటాలు చేస్తూ నృత్యాలు చేసిన వైనం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం మాజీ మంత్రి శంకర్ నారాయణ, ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, కురుబ కళ్యాణమండపం అధ్యక్షులు మాలకొండ మల్లికార్జున మాట్లాడుతూ కుల వివక్ష అన్యాయముకు నిండిన కాలంలో మానవత్వం అనే పవిత్ర మంత్రాన్ని సమాజానికి అండగా నిలిచారన్నారు. కనకదాసు చూపిన మార్గంలో అందరూ కలిసికట్టుగా ఐక్యమత్తంగా నడవాలని వారు పిలుపునిచ్చారు. తదుపరి అన్నదాన కార్యక్రమానికి వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మొత్తం మీద జయంతి వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో కురుబ కళ్యాణమండపం కార్యదర్శి బలరాం, నాయకులు గవ్వల నారాయణస్వామి, పూజారి నరసింహులు, గవ్వల బాబు, కోటి వెంకటేష్, పోతుకుంట రమేష్, అద్ర మహేష్, గొట్లూరు శివయ్య, గిరక నాగేంద్ర, గిరక నారాయణస్వామి, కాపాడం పరమేశ్వరయ్య ,నాగభూషణం, గవ్వల ఆది, టీచర్ గోవిందు, కోటి సంజీవ్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## కుతుకులూరులో వైయస్ఆర్‌సీపీ సమావేశం ఘనవిజయం- ఎమ్మెల్యే కుట్రలు విఫలం

రామకృష్ణారెడ్డి పన్నాగాలు ఫలించలేదు

ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డికి ముందస్తు బెయిల్‌తో సంబరాలు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 08:** అనపర్తి నియోజకవర్గంలోని కుతుకులూరు గ్రామంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సమావేశం ఘనంగా జరిగింది. గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు విస్తృతంగా హాజరై విజయవంతం చేశారు. సమావేశం విజయవంతంగా ముగియడంతో గ్రామంలో ఉత్సాహ వాతావరణం నెలకొంది. రామకృష్ణారెడ్డి అనుచరులు భయం సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలు ఆ అడ్డంకులను సవాళ్లుగా స్వీకరించి, సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రజల విశేష హాజరుతో జరిగిన ఈ సమావేశం రామకృష్ణారెడ్డికి గట్టి ఎదురు దెబ్బగా మారింది. వైయస్ఆర్‌సీపీ కార్యకర్తల ఐక్యత చూసి ఆందోళనకు గురైన రామకృష్ణారెడ్డి, రాజకీయ కుట్రలతో ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి ని లక్ష్యంగా చేసుకున్నారని అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. వేరే వ్యక్తులకు సంబంధించిన బాణసంచా సామగ్రి లభించిన ఘటనను అవకాశంగా తీసుకుని, నాగిరెడ్డి పేరుని అన్యాయంగా చేర్చి, నాటు బాంబులు కలిగి ఉంటే పెట్టే తీవ్రమైన సెక్షన్ ల కింద స్థానిక శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సబ్బెళ్ళ నాగిరెడ్డి పై కేసు నమోదు చేయించారని డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులపై ఒత్తిడి తెచ్చి అరెస్ట్ చేయించే ప్రయత్నం జరిగినా, న్యాయస్థానం ద్వారా నాగిరెడ్డి ముందస్తు బెయిల్ పొందడంతో రామకృష్ణారెడ్డి ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగిరెడ్డి ని ఇబ్బందులకు గురిచేసి లొంగదీసుకోవాలనే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కుట్ర ఇది" అని వారు మండిపడ్డారు. ప్రజల విశ్వాసం గెలుచుకున్న ధైర్యవంతుడు, ప్రజానాయకుడైన సబ్బెళ్ళ నాగిరెడ్డి ని తప్పుడు ఆరోపణలతో ఇబ్బందులకు గురి చేయలేరని స్పష్టం చేశారు. కుతుకులూరు గ్రామం వైయస్ఆర్‌సీపీకి బలమైన స్థావరమని, అక్కడి కార్యకర్తల ఐక్యతను దెబ్బతీయాలన్న రామకృష్ణారెడ్డి ప్రతి ప్రయత్నం కూడా వారి ఏకమైపాటువల్ల విఫలమవుతోందని పార్టీ నాయకులు వ్యాఖ్యానించారు.

## అద్దంకి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని



**కనిగిరి నవంబర్ 8 అంకుశం న్యూస్ :**కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామ వాస్తవ్యులు అద్దంకి నాగమల్లేశ్వరరావు, శ్రీమతి వైదేహి దంపతుల కుమారుడు చిరంజీవి నాగరాజు, నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం సోమల రేగడ గ్రామ వాస్తవ్యులు మన్నేపల్లి శ్రీనివాసులు శ్రీమతి లక్ష్మీదేవి దంపతుల కుమార్తె లావణ్య ల వివాహ వేడుకలు శనివారం తెల్లవారుజాము 3 గంటల 29 నిమిషాలకు పోతవరం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నాగరాజు దంపతులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కల గండి రిజర్వాయర్ మాజీ చైర్మన్ అద్దంకి మాల్యాద్రి, అద్దంకి నాగయ్య, అద్దంకి మల్లికార్జునరావు, మాల్యాద్రి, ప్రకాష్ రావు, కొండలరావు, ఇండ్ల చెరువు వెంకటేష్, అద్దంకి వారి కుటుంబ సభ్యులు, మన్నేపల్లి వారి కుటుంబ సభ్యులు, ఇండ్ల చెరువు వారి కుటుంబ సభ్యులు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## పెనుకొండ లో వైయస్సార్ సీపీ "ప్రజా ఉద్యమం" పోస్టర్ ను ఆవిష్కరించిన ఉషశ్రీ చరణ్





**అంకుశం న్యూస్ పెనుగొండ నవంబర్ 8:** కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 12వ తారీఖున పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలుకు సంబంధించి పోస్టర్ను మాజీ మంత్రి ఉష శ్రీ ఆవిష్కరించారు. శ్రీ సత్య సాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గం, పెనుకొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నందు గౌరవ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు నవంబర్ 12 బుధవారము రోజున రాష్ట్రవ్యాప్తంగా జరిగే మెడికల్ కాలేజీల ప్రవేటికరుణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతాష్ఠితకంగా చేపట్టిన వైయస్సార్సీపీ "ప్రజా ఉద్యమం"పోస్టర్ ను ఆవిష్కరించిన మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ రాష్ట్ర వాల్మీకి విభాగం అధ్యక్షులు పొగాకు రామచంద్ర మరియు పెనుకొండ నియోజకవర్గం లోని పలు మండలాల ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..లి

## కురుబల విజ్ఞాపనలకు సీఎం ఆమోదం

భక్త కనకదాస జయంతి సభలో మంత్రి సవిత






**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 8:** వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చిరు. కళ్యాణదుర్గంలో భక్త కనకదాసు జయంతి సభలో మంత్రి సవిత మాట్లాడుతూ.... అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీల పక్షపాతిగా పనిచేస్తున్న మంత్రి లోకేష్ కు అభినందనలు. కురుబ కులం నీతి, నిజాయతీకి మారుపేరు. లోకేష్ పాదయాత్రలో బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారు. రాయలసీమలో అధికంగా ఉన్న కురుబ కులస్తులను గుర్తించి కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించడం, విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉంది. బీసీలు తెలుగుదేశం పార్టీకి బ్యాక్ బోన్ వంటి వారు. గుడికట్ల పూజారులకు గౌరవవేతనం ఇవ్వడం హర్షణీయం. గొర్రెల ఇన్సూరెన్స్ పై చంద్రబాబు, లోకేష్ చర్చిస్తున్నారు. త్వరలో ఇన్సూరెన్స్ ప్రకటించబోతున్నారు. ఆదరణ-1, ఆదరణ-2 తెచ్చింది చంద్రబాబు గారు, ఆదరణ - 3 తెచ్చేది కూడా చంద్రబాబు గారే. ఇటీవల కార్పోరేషన్ల బాధ్యులతో చర్చించాం. ఫెన్సింగ్, ఎల్ ఈడీ లైట్లు, గొర్రెల ఉన్ని కటింగ్ మిషన్లు అడిగితే ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఆమోదించారు. చంద్రబాబు కురుబలకు పెద్దపీట వేశారు. నాకు బీసీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు అప్పగించారని అన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంప్ ను ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 08:** అనపర్తి మండలం రామవరం లో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ...ఈనెల 10వ తేదీన అనగా సోమవారం కుతుకులూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమల తిరుపతి వెంకటేశ్వరరెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతోంది. దానిలో భాగంగా 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి L.V ప్రసాద్ కంటి వైద్య శిబిరం,అదే విధంగా జనరల్ సర్జన్, గైనకాలజీ,డెంటల్ కి సంబంధించిన వైద్యులు ఆ శిబిరంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తారు. అదే విధంగా తిరుమల తిరుపతి వెంకటేశ్వరరెడ్డి చే రోగులందరికీ కూడా ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోంది. అదేవిధంగా కంటి వైద్యానికి సంబంధించి పరీక్షలు చేసిన తర్వాత అవసరం అయినట్లయితే, తప్పనిసరిగా వారందరికీ ఉచితంగా ఆపరేషన్ చేసే కార్యక్రమం కూడా వారు చేపట్టడం జరుగుతా ఉంది. కనుక ఈ ప్రాంత ప్రజానీకం అంత మీకు ఉన్న ఆరోగ్య సమస్యలను పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా ఈ సేవలు వినియోగించమని సవినయంగా కోరడం జరిగింది.

## ఎస్.సత్యనారాయణకు ఘన స్వాగతం..



**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 8:** రాష్ట్ర స్థాయి శ్రీ భక్త కనసదాస 538వ జయంతోత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అనంతపురం విచ్చేశారు. శనివారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ ఎస్.సత్యనారాయణను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు.

# చిత్తూరు, కర్నూలు బౌలర్ల హవా

- రక్షన్ సాయి 6 వికెట్లతో విజృంభన
- హేమంత్, యెస్వంత్, తరుణ్, రోహిత్, టెడ్రిక్ అద్భుతమైన బౌలింగ్
- చిత్తూరు తొలి ఇన్నింగ్స్ 63 ఆలౌట్, కర్నూలు తొలి ఇన్నింగ్స్ 56 ఆలౌట్ చిత్తూరు రెండో ఇన్నింగ్స్ 78/2
- కడప తొలి ఇన్నింగ్స్ 198 ఆలౌట్ అనంతపురం తొలి ఇన్నింగ్స్ 54/3






**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి కడప నవంబర్ 08:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్ 14 అంతర్ జిల్లా క్రికెట్ మ్యాచ్ లో చిత్తూరు, కర్నూలు హవా నడుస్తోంది చిత్తూరు బౌలర్ రక్షన్ సాయి అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు కర్నూలు బ్యాటర్లను తక్కువ పరుగులకే కట్టడి చేశాడు. రక్షన్ సాయి 10.3 ఓవర్లలో 4 మేడిన్ ఓవర్ల వేసి 19 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. హేమంత్, యెస్వంత్, తరుణ్, రోహిత్, టెడ్రిక్ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన కనబరిచారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్ 14 అంతర్ జిల్లా మ్యాచ్ కడపలోని కె.ఓ.ఆర్.ఎమ్ కాలేజ్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్ లో 28.3 ఓవర్లలో 63 పరుగులకు ఆలౌట్ అయింది లికిత్ రెడ్డి 36 పరుగులు మినహా ఏ ఒక్క బ్యాటర్ రాణించలేదు. కర్నూలు బౌలర్లు హేమంత్ 4, యెస్వంత్ 3, శరణ్య రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. కర్నూలు తొలి ఇన్నింగ్స్ ఆలౌట్ అయింది మోక్షజ్ఞ రెడ్డి 26 పరుగులు తీశాడు చిత్తూరు బౌలర్లు రక్షన్ సాయి 6, తరుణ్ 3, హాఫీజ్ ఒక వికెట్ తీసుకున్నారు. చిత్తూరు రెండో ఇన్నింగ్స్ లో కాస్త నిలకడగా రాణిస్తూ ఆట ముగిసే సమయానికి 78/2 పరుగులు తీశారు క్రీజులో లికిత్ 27, గోవర్ధన్ 13 నాటౌట్ గా వున్నారు ఈ మ్యాచ్ కు అంపైర్లుగా ఎస్. వెంకటరావు, రవి కుమార్ స్కోరర్ గా శ్రీనివాస్ వ్యవహరించారు

**అనంతపురం వర్సెస్ కడప**

కడప కె.ఎస్. ఆర్.ఎమ్ మైదానంలో అనంతపురం కడప జట్లు పోటీ పోటీపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప తొలి ఇన్నింగ్స్ లో 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది కడప బ్యాటర్లు సాయి కృష్ణ చైతన్య 32, ప్రశాంత్ 41, తహీర్ 39 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు రోహిత్ 3, టెడ్రిక్ విక్రాంత్ 3, ఆదిత్య రెడ్డి 2, కృతిక్ సాయి, హేమచంద్ర నాయక్ చెరో ఒకొక్క వికెట్ తీసుకున్నారు. అనంతపురం తొలి ఇన్నింగ్స్ లో 28 ఓవర్లలో 54/3 పరుగులు తీశారు మోక్షజ్ఞ తేజ్ 19, పంకజ్ మీనా 15 పరుగులకు చేసి ఆవుట్ కాగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి క్రీజుల్ కృతిక్ సాయి 3, ప్రణధీర్ 3 నాటౌట్ వున్నారు. కడప బౌలర్లు ముని 2, మౌనీష్ 1 వికెట్ తీసుకున్నారు ఈ మ్యాచ్ కు అంపైర్లుగా హుకుం సింగ్, కిరణ్ కుమార్ రాజశేఖర్ స్కోరర్ గా రాఘవేంద్ర వ్యవహరించారు

## రాప్తాడులో ఘనంగా భక్త కనకదాస జయంతి వేడుకలు



**రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 8:** మండల కేంద్రం రాప్తాడులో శనివారం భక్త కనకదాస జయంతి వేడుకలను కురుబలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కనకదాసు విగ్రహాన్ని పూలతో అలంకరించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. సమాజంలో అసమానతలపై ఆయన కవిత్వం ద్వారా అందించిన సందేశాలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమన్నారు. కనకదాసు బోధనలు సమానత్వం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పంపు కొండప్ప, కొండూరు బీరన్న, చిరుతల నాగేంద్ర, దండు శ్రీనివాసులు, గువ్వల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ క్రీడల నిర్వహణకు ఎన్ టి పి సి విరాళం



**అంకుశం న్యూస్ అనంతపురం, నవంబర్ 8:** అనంతపురం జిల్లా ప్రధాన కేంద్రంలోని ఆర్డిటిస్టేడియంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగులరాష్ట్ర స్థాయి క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎన్టీపీసీ ప్రభుత్వ సంస్థకు చెందిన ఏ పీ ఎన్ హెచ్ ఏ ఎల్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ను శనివారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి 5 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. నవంబర్ 7 ,8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాలు విజయవంతం కావాలని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ హరిత అమృత్ లిమిటెడ్ ప్రతినిధులు అలాగే ఆ సంస్థ కన్సల్టెంట్ జీవి విశ్వనాథ్, ఇంజనీర్లు అభిజిత్ రాంబాబులు తదితరులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు.

## నవంబరు 9న తిరుమలలో కార్తీక వన భోజనం




**అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 8:** కార్తీక వన భోజన కార్యక్రమం నవంబరు 9వ తేది తిరుమలలోని గోగర్భం సమీపంలో గల పార్వేటమండపంలో జరుగనుంది. పవిత్రమైన కార్తీకమాసంలో వనభోజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఇందులో భాగంగా ఉదయం 8.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకిపై ఆలయంనుంచి బయలుదేరి ఊరేగింపుగా పార్వేటమండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుండి 12 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిసారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. అటు పిమ్మట మధ్యాహ్నం 1 నుండి 2 గంటల నడుమ కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం కారణంగా శ్రీవారి అలయంలో నిర్వహించు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకాం సేవలను టీటీడీ రద్దు చేసింది.ఈ కార్యక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొంటారు.

## కపిలేశ్వరాలయంలో రుద్రహోమం ప్రారంభం



**అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 8:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీ కపిలేశ్వరస్వామివారి హోమం (రుద్రహోమం) శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. నెల రోజుల పాటు జరుగుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా నవంబరు 8 నుండి 18వ తేదీ వరకు 11 రోజుల పాటు ఈ హోమం నిర్వహిస్తారు.ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం పూజ, రుద్రజపం, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం పూజ, జపం, హోమం, రుద్రత్రిశతి, బిల్వార్చన, నివేదన, విశేషదీపారాధన, హారతి ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.


## నారా లోకేష్ ను కలవకుండా సాకే హరి అరెస్టు



**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 8:** ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విద,ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కలవడానికి వెళు తున్న సాకే హరిని దారి మధ్యలో సీఐ వెంకటరమణ పోలీస్ సిబ్బందితో పోలీస్ వాహనంలో సాకే హరితో పాటు సిపిఐ ఎం ఎల్ జిల్లా సెక్రెటరీ వేమన,బేడ బుడుగ జంగం జిల్లా అధ్యక్షులు శిరిశాల అంజి, ఎస్సీ,,ఎస్టీ జే ఏ సీ రామకృష్ణ, మధు,రాజులను అరెస్టు చేసి తీసుకెళ్లారు.మంత్రి నారా లోకేష్ వెళ్ళిపోయిన తర్వాత అరెస్టు చేసిన వారిని అనంతపురం పంపి వేశారు.ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ..ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి తనయుడు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామంటే పోలీసులతో అరెస్టులు చేయించడం భావ్యం కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో అరెస్టు, అడ్డంకులు ఉండవని చెప్పిన మంత్రి లోకేష్ మాట తప్పారన్నారు.అధికార పార్టీ నాయుకులు కార్యకర్తలతో బొకే, శాలువ,గజ మాలలతో సత్కరించుకుంటారు.ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే వారికి అవకాశం కల్పించాలన్నారు.మంత్రుల పర్యాటనలనకు ప్రజా ధనం ఖర్చు పెడుతూ పార్టీ కార్యక్రమాలాగ మారుస్తున్నారని ద్వజమెత్తారు.ఇకనుంచైన ప్రజల సమస్యలు తెలుసుకొనేలా ప్రభుత్వ నాయుకులు చూడాలన్నారు.

## బోళాశంకరుడి అనుగ్రహం ప్రజలందరిపై వుండాలి :

- ఎంపి కేశినేని శివనాథ్
- సిద్దార్థ హెూటల్ మేనేజ్మమెంట్ కాలేజీ గ్రౌండ్ లో కార్తీక దీపోత్సవం



**అంకుశం ప్రతినివిజయవాడ : నవంబర్ 8:** ఆ పరమేశ్వరుడి అనుగ్రహం ప్రజలందరిపై వుండి సుఖసంతోషాలతో వుండాలని ఎంపి కేశినేని శివనాథ్ ప్రార్ధించించారు. ఈటీవీ ఆధ్వర్యంలో విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హెూటల్ మేనేజ్మెంట్ కళాశాల మైదానం లో శనివారం సాయంత్రం కార్తీక దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపి కేశినేని శివనాథ్ , రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర,ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ , ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి , జెడ్పీటీసీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆ పరమశివుడి పూజ కార్యక్రమంలో పాల్గొని, వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

ఎంపి కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ కార్తీక దీపోత్సవానికి రావటం చాలా ఆనందం గా వుందన్నారు.. విజయవాడ నగరం అంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని పేర్కొన్నారు. కార్తీక దీపాల వెలుగులో విజయవాడ నగరం దేదీప్యమానంగా మెరిస్తుందన్నారు. ప్రజల్లో భక్తితో పాటు , ఆధ్యాత్మిక భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్తీక దీపోత్సవం కార్యక్రమం చేపట్టిన ఈటీవీ యాజమాన్యాన్ని అభినందించారు.

## పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఘనంగా శ్రీ భక్త కనకదాసు జయంతి నిర్వహణలి

జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, నవంబర్ 8:** జిల్లా వెనుకబడిన సంక్షేమ తరగతుల శాఖ ఆధ్వర్యంలో... శ్రీ భక్త కనకదాసు జయంతిని శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమంలో శ్రీ భక్త కనకదాసు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, భక్తిశ్రద్ధలతో కలెక్టరు, జేసి, డిఆర్ఓ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, బీసీ సంఘాల నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ భక్త కనకదాసు జీవితం, ఆయన బోధనలు, సామాజిక స్ఫూర్తిపై పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, మహేష్ జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర, ఆర్టీవో కరుణ సాగర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి మోహన్ రామ్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పబ్లిక్ హెల్త్ అధికారి నరసింహ, వెనుకబడిన తరగతుల వివిధ సంఘాల నాయకులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేశినేని శివనాథ్ ను కలిసిన టాలీవుడ్ అగ్ర నిర్మాత సి.అశ్వినీదత్



**అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 8:** వైజయంతీ మూవీస్ అధినేత, ప్రముఖ నిర్మాత చలసాని అశ్వినీదత్ శనివారం ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ కి విచ్చేసిన నిర్మాత సి.అశ్వినీదత్ కు ఎంపీ కేశినేని శివనాథ్ సాదర స్వాగతం పలికారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఛాంబర్ లో వున్న టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుద్దా వెంకన్నలను కూడా నిర్మాత సి.అశ్వినీదత్ కలవటం జరిగింది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపీ కేశినేని శివనాథ్ చేస్తున్న కృషిని నిర్మాత సి.అశ్వినీదత్ అభినందించారు. ఏసీఏ అధ్యక్షుడిగా రాష్ట్రంలో క్రికెట్ రంగం అభివృద్ధి కోసం కేశినేని శివనాథ్ ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం వీరంతా కలిసి సరదాగా కాసేపు రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు.

## షాట్ పుట్ లో రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీలో సత్తా చాటిన జి.బి. ఆర్ విద్యార్థిని హాసిని



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 08:** ఇటీవల జరిగిన 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్. జి. ఎఫ్) ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పలాస దగ్గర గోవిందపురం క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్ -14 షాట్ పుట్ బాలికల విభాగం లో రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీల్లో అనపర్తి జి.బి.ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూలు లో 9 వ తరగతి చదువుతున్న హై స్కూల్ విద్యార్థిని ఎ. హాసిని శ్రీ సాయి కౌశిత తృతీయ స్థానం సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా జి.బి.ఆర్ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంటు శ్రీ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) , జి.బి.ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి. హరిప్రసాద్ , హెచ్.ఎం. రామారావు, ప్రైమరీ హెచ్.ఎం. భువనేశ్వరి, ప్రీ ప్రైమరీ హెచ్.ఎం. కామాక్షి, మేనేజ్మెంట్ ఇంచార్జు శ్రీ వెంకట రెడ్డి, వెంకటరెడ్డి, అకాడమిక్ కో- ఆర్డినేటర్ ప్రశాంతి రెడ్డి, గేమ్స్ డైరెక్టర్ మహేంద్ర రెడ్డి, ఏవో ఆచారి ఆ విద్యార్థినిని మరియు ఆమెకు అత్యుత్తమ శిక్షణనిచ్చిన కోచ్ లు సురేష్ కుమార్, నగేష్ లను అభినందించారు

## జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన రూపా రాజా పి సి ఎం ఆర్ విద్యార్థులు.




**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 8:** ధర్మవరం మండలం పరిధిలో గల నాగలూరు వద్ద ఉన్న రూపా రాజా పి సీ ఎంఆర్ పాఠశాల విద్యార్థి బి. కార్తీక్ విజయవాడ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో( రెజ్లింగ్ ) బంగారు పతకం సాధించి , జాతీయస్థాయిలో ఉత్తర ప్రదేశ్ లో జరిగే రెజ్లింగ్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని,అలాగే టి. దిలీప్ రజత పథకం, బి. యశ్వంత్ కాంస్య పతకం సాధించి సత్తా చాటడం జరిగిందని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి కుస్తీ పోటీలలో రాణించి, రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికై రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన అరుణ్ కుమార్ రెడ్డి ప్రతిభను కొనియాడారు. రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో రాణించి, బంగారుపతకం సాధించి నేషనల్ స్థాయికి ఎంపిక కావడం మా పాఠశాలకు ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రూప రాజా కృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్ కుమార్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వై ఎస్ ఆర్ సి పి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం!



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 8:** ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర అధినేత, మాజీ ముఖ్య మంత్రి వై ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ధర్మవరం లో కోటి సంతకాల సేకరణ ఉద్యమం కార్యక్రమం చేపడుతున్నామని 21 వార్డు ఇంచార్జి కత్తే పెద్దన్న 22 వార్డు ఇంచార్జి కుమార స్వామి లు తెలిపారు. ఈ కార్యక్రమం ధర్మవరం అన్ని వార్డులలో జరుగుతోందని అన్నారు.